కరెంట్ షాక్‌తో రైతు మృతి

- కరీంనగర్ జిల్లా లింగాపూర్‌లో ఘటన

మానకొండూర్ రూరల్, ఏప్రిల్ 1 : మోటర్ నడవకపోవడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై ఓ రైతు మరణించాడు. ఈ ఘటన కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లింగాపూర్‌లో సోమవారం చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగాపూర్‌కు చెందిన రైతు పిట్టల సంపత్ (35) కౌలుకు చేస్తున్న పొలం వద్ద మోటర్ నడవకపోవడంతోసమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆన్ ఆఫ్ చేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కరెంటు షాక్ తగిలి కింద పడిపోయాడు. కుటుంబసభ్యులు సంపత్‌ను కరీంనగర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు తెలిపారు. భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు.

రుణమాఫీపై కాంగ్రెస్ హ్యాండ్సప్!

- ఎన్నికల కోడ్ ఉన్నది.. ఎలా అమలు చేస్తాం?
- రుణమాఫీపై ఉత్తమ్ వ్యాఖ్యలు
- కోడ్ వస్తుందని తెలియదా?
- మంత్రి వ్యాఖ్యలపై రైతుల ఆగ్రహం
- కోడ్‌ను సాకుగా చూపి కాంగ్రెస్ తప్పించుకుంటుందని ఎప్పుడో చెప్పిన బీఆర్ఎస్
- నిజం చేసేలా ఉత్తమ్ ప్రకటన

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): రుణమాఫీపై బీఆర్ఎస్ నేతలు మొదటినుంచీ అనుమానిస్తున్నట్టే జరిగింది. రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వరకు తాత్సారం చేసి, ఎన్నికల కోడ్ రాగానే దానిని సాకుగా చూపించి తప్పించుకుంటుందని, బీఆర్ఎస్ పార్టీ మొదటి నుంచీ చెప్తూనే ఉన్నది. దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం అక్షరాల నిజం చేసింది. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సోమవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. 'ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా రుణమాఫీ ఎలా చేస్తాం? ఈ మాత్రం కూడా కేసీఆర్‌కు తెలియదా?' అని వ్యాఖ్యానించడం గమనార్హం. తాము అధికారంలోకి రాగానే డిసెంబర్ 9న రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఆయనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలవుతున్నా ఆ హామీ అమలుకాలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం పలు జిల్లాల్లో ఎండిపోయిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఎప్పుడు చేస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి ఉత్తమ్.. ఎన్నికల కోడ్ ఉండగా రుణమాఫీ ఎలా చేస్తామంటూ చేతులెత్తేశారు. దీంతో ఉత్తమ్ వ్యాఖ్యలను ఇటు రైతులు, అటు బీఆర్ఎస్ నేతలు తప్పుపడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఉన్న విషయం తెలియదా? ఎన్నికల కోడ్ వస్తుందని తెలియదా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పుడు కోడ్ వచ్చిందంటూ సాకులు చెప్పడం ఏమిటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కోడ్ రాకముందే రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు. నిజానికి ఎన్నికల కోడ్ ఆకస్మికంగా వచ్చినదేమీ కాదు. మార్చి రెండో వారంలో ఏ క్షణంలోనైనా ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతుందని, ఆ మరుక్షణం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందనేది ఆర్నెళ్ల క్రితం నుంచి అందరూ ఊహిస్తున్నది. నిజంగా రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉండి ఉంటే అప్పటికే మూడు నెలల సమయం ఉన్నదని రైతులు గుర్తుచేస్తున్నారు. ఇన్నాళ్లూ తాత్సారం చేసి ఇప్పుడు కోడ్ వంకలు పెట్టడమేమిటని ప్రశ్నిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం యాసంగి సీజన్ రైతుబంధు నిధులు విడుదల చేయడానికి ప్రయత్నించగా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న ఇదే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి, నిలుపుదల చేయించిందని గుర్తుచేస్తున్నారు. నాడు రైతుబంధుకు ఎన్నికల కోడ్ నిబంధన వర్తించినట్టే.. ఇప్పుడు రుణమాఫీకి సైతం వర్తిస్తుందన్న విషయం కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలకు తెలియదా? తెలిసీ ఎందుకింత తాత్సారం చేశారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రుణమాఫీ చేయాలనే ఆలోచన కాంగ్రెస్ పార్టీకి లేదని, కేవలం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఈ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చాక బుట్టదాఖలు చేసిందనే విమర్శలొస్తున్నాయి. ఒకవేళ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల కోడ్ కన్నా ముందే రుణమాఫీ చేసేదని అంటున్నారు. రుణమాఫీ చేయలేనివాళ్లు డిసెంబర్ 9న మొత్తం రుణమాఫీ చేస్తామని ప్రకటించడం ఎందుకు? రైతులను మోసం చేయడం ఎందుకు? అనే ప్రశ్నలు వినిస్తున్నాయి.

ఇన్‌చార్జ్ వద్దని..

మొదటిపేజీ తరువాయి...

పార్లమెంట్ స్థానాలు గెలుచుకునే వ్యూహంతో మూడు నెలల కిందట నియోజకవర్గాలకు ఇన్‌చార్జీలను నియమించింది. మంత్రులతోపాటు సీఎం, డిప్యూటీ సీఎంను కూడా ఇన్‌చార్జీలుగా బాధ్యతలు అప్పగించింది. సీఎం రేవంత్‌రెడ్డిని మహబూబ్‌నగర్, చేవెళ్ల ఇన్‌చార్జిగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను హైదరాబాద్, సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా నియమించింది. ఎన్నికల వ్యూహంపై నియోజకవర్గాల ముఖ్యనేతలతో వీరు సమీక్షలు కూడా నిర్వహించారు. తాము ఇన్‌చార్జీలుగా ఉన్న నియోజకవర్గాల్లో పార్టీ ఓటమి పాలైతే తమ పదవులకే ఎసరు వచ్చే ప్రమాదం ఉన్నదని భావించే సీఎం, డిప్యూటీ సీఎం ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తప్పుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే, వీరి సన్నిహితులు మాత్రం వేరే కారణం చెప్తున్నారు. కీలక బాధ్యతల్లో ఉన్న సీఎం, డిప్యూటీ సీఎంను కేవలం రెండు నియోజకవర్గాల ఇన్‌చార్జీలుగా పరిమితం చేయకుండా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలను పర్యవేక్షించే విధంగా అధిష్ఠానం వెసులుబాటు కల్పించిందని వీరి సన్నిహితుల వాదన.

మంత్రి కోమటిరెడ్డికి చెక్

సీఎం రేవంత్‌రెడ్డి ఇన్‌చార్జీగా ఉన్న మహబూబ్‌నగర్ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే, ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్‌ను, చేవెళ్లకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని, డిప్యూటీ సీఎం భట్టి ఇన్‌చార్జిగా ఉన్న సికింద్రాబాద్‌కు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని, హైదరాబాద్‌కు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్‌ను ఇన్‌చార్జీలుగా నియమించింది. నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతల నుంచి సీఎం, డిప్యూటీ సీఎం తప్పుకోవడం ఒక ఎత్తుగడ అయితే, వెంకట్‌రెడ్డికి చెక్ పెట్టడం రెండో ఎత్తుగడ అయి ఉండొచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్‌ను కూల్చాడానికి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఏక్‌నాథ్‌షిండే పాత్ర పోషించడానికి తమతో సంప్రదింపులు జరిపారని బీజేపీ శాసనసభాపక్షం నేత మహేశ్వర్‌రెడ్డి బయటపెట్టిన 24 గంటల్లోనే ఆయనను సికింద్రాబాద్ ఇన్‌చార్జిగా నియమించడం గమనార్హం. ఈ నియామకంలో ఒకే దెబ్బకు రెండు పిట్టల వ్యూహం దాగి ఉన్నదని కాంగ్రెస్ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. మంత్రి కోమటిరెడ్డి భవిష్యత్తులో ఏక్‌నాథ్ షిండేగా మారే అవకాశం లేకుండా ఆదిలోనే చెక్ పెట్టడం ఒకటైతే, సికింద్రాబాద్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియోజకవర్గానికే ఈయనను ఇన్‌చార్జీగా నియమించడం ద్వారా దొంగ చేతికే తాళం చెవి ఇచ్చినట్టు అవుతుందన్నది రెండో ఎత్తుగడగా కాంగ్రెస్ రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు.

కరువుపై వ(భ)ట్టి మాటలు!

- నీరు, కరెంట్ ఇవ్వలేక.. ప్రశ్నించినవారిపై ఎదురుదాడి
- రైతుల్లో భరోసా నింపుతున్న కేసీఆర్ వ్యాఖ్యలపై అబద్ధాలు
- విక్రమార్కవన్నీ నీలాపనిందలే

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): ఆడలేక పాత గజ్జెలు అన్నట్టుగా ఉన్నది రాష్ట్ర ప్రభుత్వం తీరు. కార్యాచరణ లేక, పాలన చేతగాక, సక్రమంగా సాగు, తాగునీరందించలేక, కరెంట్ ఇవ్వలేకపోతున్న పాలకపక్షం చేతగానితనాన్ని నిలదీసిన వారిపై ఎదురుదాడికి దిగుతున్నది. పచ్చి అబద్ధాలు వల్లె వేస్తున్నది. ఎండిన పంట పొలాలను సందర్శించి, రైతుల్లో భరోసానింపుతున్న ప్రధాన ప్రతిపక్షనేత కేసీఆర్‌పైనా విమర్శల దాడి చేస్తున్నది. సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఢిల్లీలో ప్రెస్‌మీట్ పెట్టి కేసీఆర్‌పై నీలాపనిందలు మోపారు. అబద్ధాలు వల్లించారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణం, భద్రాద్రి పవర్ ప్లాంట్ ఏర్పాటు, విద్యుత్తు కోతలు, వేతనాల మంజూరు అంశాలపై భట్టి వట్టి మాటలు చెప్పారు. గుడ్డెద్దు చేలో పడ్డట్టు.. నోటికొచ్చిన అబద్ధాలు ఆడారు. భట్టి మాట్లాడిన అబద్ధాలు.. వాస్తవాలు లేంటో ఇక్కడ చూద్దాం.

అబద్ధం..

యాదాద్రి పవర్ ప్లాంట్ నిర్మాణం ఆలస్యమైంది. దాంతో నిర్మాణ వ్యయం పెరిగింది. ముందుకు పోలేము. వెనక్కి రాలేము అన్న చందంగా మారింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రద్దుచేసినా కేసీఆర్ పట్టించుకోలేదు.

వాస్తవం..

కరోనా లాక్‌డౌన్‌తో కార్మికులు సొంత ప్రాంతాలకు వెళ్లడంతో పనుల్లో జాప్యం జరిగింది. లేకపోతే యాదాద్రి ఇప్పటికే పూర్తయ్యేది. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి. ప్రజాభిప్రాయ సేకరణ జరిపిన తర్వాతే విద్యుత్తు ఉత్పత్తిని ప్రారంభించాలని ఎన్జీటీ ఆదేశించింది. ఫిబ్రవరిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సైతం ప్లాంట్‌కు అనుకూలంగా మద్దతు పలికారు.

అబద్ధం..

భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో చేపట్టారు. దీంతో తడిసి మోపెడవుతున్నది.

వాస్తవం..

భద్రాద్రి పవర్ ప్లాంట్‌ను గతంలో ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వమే పెండింగ్‌లో పెట్టింది. ఈ ప్లాంట్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. 2014లో తెలంగాణ ఏర్పాటైన సమయంలో రాష్ట్రంలో విద్యుత్తు వినియోగం 12 వేల మెగావాట్లు ఉండేది. కానీ, ఉత్పత్తి ఆరు వేలు మాత్రమే. ఇది చాలదంటూ ఏపీ నుంచి 2 వేల మెగావాట్ల విద్యుత్తును అక్కడి ప్రభుత్వం ఇవ్వకుండా మొండికేసింది. రైతులకు, ప్రజలకు త్వరగా కోతల్లేని విద్యుత్తునందించాలన్న సంకల్పంతో కేటీపీఎస్ 7వ ఫేజ్‌ను పూర్తిచేసి 2 వేల మెగావాట్లను కేసీఆర్ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫలితంగా 6 నెలల్లోనే కోతల్లేని విద్యుత్తును అందించగలిగింది.

అబద్ధం..

తెలంగాణలో ఇప్పుడు విద్యుత్తు కోతల్లేవు. మేము అధికారం నుంచి దిగిపోగానే కరెంట్ పోయిందని బీఆర్ఎస్ నేతలు అబద్ధాలు చెప్తున్నారు.

వాస్తవం..

మెయింటెనెన్స్ పేరుతో హైదరాబాద్‌లో కొంత కాలం క్రితం రోజుకు రెండు గంటలు విద్యుత్తు సరఫరాలో కోతలు పెట్టారు. కొన్ని ప్రాంతాల్లో 30 నిమిషాల నుంచి 2 గంటల పాటు కోతలు విధించారు. ఆదిలాబాద్ జిల్లాలో కేంద్ర మంత్రి అర్జున్‌ముండా పాల్గొన్న సభలో కరెంట్ కట్ అయ్యింది. జగిత్యాలలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో కరెంట్ కట్ కాగా.. మంత్రి శ్రీధర్‌బాబు భూపాలపల్లి జిల్లాలో సెల్‌ఫోన్ లైట్లల్లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఘటనలు చోటుచేసుకున్నాయి. కోతల్లేవని పైకిచెబుతున్నా ఇవే సాక్ష్యంగా నిలుస్తున్నాయి. అడపాదడపా ఎక్కడో ఓ చోట కరెంట్ కోతలు నిత్యకృత్యం కావడం వాస్తవం.

అబద్ధం..

మార్చి ఒకటో తారీఖునే ఉద్యోగులకు వేతనాలు, పెన్షనర్లకు భత్యం చెల్లించాం.

వాస్తవం..

వాస్తవానికి సోమవారం (ఏప్రిల్ 1వ తేదీన) ఉద్యోగులకు వేతనాలు అందలేదు. పెన్షనర్లకు భత్యం చెల్లించలేదు. కానీ, వేతనాలినిచ్చినట్టు ప్రభుత్వం ప్రకటించుకుంటున్నది. కాగా, మాడల్ స్కూల్ టీచర్లు, అంగన్‌వాడీ టీచర్లు, కేజీబీవీ టీచర్లు, సమగ్రశిక్ష ఉద్యోగులకు పదో తేదీ దాటితే కానీ వేతనాలు పడటం లేదు.

అబద్ధం..

ఎస్ఎల్‌బీసీ సొరంగం పదేండ్లల్లో ఒక్క అడుగు పనులు ముందుకు పడలేదు.

వాస్తవం..

టన్నెల్ 1 మొత్తం పొడవు 43.93 కిలోమీటర్లు. ఉమ్మడి రాష్ట్రంలో 22.43 కిలోమీటర్లు పూర్తి చేస్తే తెలంగాణ ఏర్పాటు అనంతరం 11.93 కిమీ పూర్తిచేశారు.

బీజేపీ మ్యానిఫెస్టోలో బీసీల డిమాండ్లు పెట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్, ఏప్రిల్1 (నమస్తే తెలంగాణ): బీసీల డిమాండ్లను బీజేపీ మ్యానిఫెస్టోలో చేర్చాలని, లేదంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య హెచ్చరించారు. ఈ మేరకు బీసీల డిమాండ్లను నెరవేర్చాలని సోమవారం ఆయన బీజేపీకి ఒక లేఖ రాశారు. దేశంలో బీసీలు మెజార్టీగా ఉన్నప్పటికీ విద్య, ఉపాధి, రాజకీయ, ఆర్థిక, బడ్జెట్, పారిశ్రామిక రంగాల్లో ఆ మేరకు వాటా దక్కలేదని వాపోయారు. జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలకు తగిన వాటా కల్పించేందుకు మళ్లీ సమగ్ర అధ్యయనం చేపట్టాలని, చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. ఓబీసీల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, ఎస్సీ, ఎస్టీలతో సమానంగా బీసీ విద్యార్థులకు పోస్ట్, ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని కోరారు. ప్రమోషన్లలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో, ప్రైవేట్ రంగాల్లో బీసీలకు రిజర్వేషన్లు, బడ్జెట్‌లో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని, క్రీమీలేయర్‌ను తొలగించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని బీసీలకు విస్తరించాలని, రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఓబీసీలకు పారిశ్రామిక విధానాన్ని ప్రవేశపెట్టి, అందుకు తగిన బడ్జెట్‌ను కేటాయించాలని లేఖలో ఆర్ కృష్ణయ్య పేర్కొన్నారు.



ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లోకి చొరబడి మైకులు, కుర్చీలు విరగ్గొడుతున్న ఈటల అభిమానులు

ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో ఈటల అభిమానుల వీరంగం

లోగోలు, కుర్చీలు, మైకులు ధ్వంసం • మీడియా ప్రతినిధులపై దురుసు ప్రవర్తన

ఉప్పల్, ఏప్రిల్ 1 : ఉప్పల్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఈటల రాజేందర్ అభిమానులు వీరంగం సృష్టించారు. హుజూరాబాద్ ఈటల దళిత బాధితుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ రచ్చ జరిగింది. 'ఈటల చేసిన మోసాలు, దళితులు ఎదుర్కొంటున్న బాధలు' అనే కరపత్రాలను సంఘం అధ్యక్షుడు తిప్పారపు సంపత్, అతని అనుచరులు ఆవిష్కరించారు. తమ నాయకుడికి వ్యతిరేకంగా సమావేశం పెట్టారని ఈటల అభిమానులు ప్రెస్‌క్లబ్‌లోకి వచ్చి లోగోలు, మైకులు, కుర్చీలు విరగ్గొట్టారు. సంపత్, అతని అనుచరులతోపాటు అడ్డువచ్చిన మీడియా ప్రతినిధులపైనా దాడిచేశారు. వీడియోలు చిత్రీకరిస్తున్న ఫొన్లను కింద పడేశారు. ఈ ఘటనపై బాధితుడు సంపత్, జర్నలిస్టు నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేశామని ఉప్పల్ సీఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపారు. ఈటల రాజేందర్‌పై కేసు నమోదు చేసి, తమకు రక్షణ కల్పించాలని సంపత్ డీజీపీని కోరారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు జూన్ 2కు వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల కౌంటింగ్ వాయిదా పడింది. మంగళవారం జరగాల్సిన ఈ ఓట్ల లెక్కింపును కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) జూన్ 2కు వాయిదా వేసింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్‌తోపాటు మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. గత నెల 28న జరిగిన ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు బరిలో నిలిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపును వాయిదా వేయాలని తాజా ఆదేశాల్లో సీఈసీ స్పష్టం చేసింది.

బీజేపీని ఓడగొట్టాలి: ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): దేశ యువతను, విద్యార్థులను మోసం చేసిన బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిద్దామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కే ధర్మేంద్ర పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులకు ఎన్నికల్లో ఓటు అడిగే నైతికహక్కు లేదని అన్నారు. హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో 'బీజేపీ హఠావో-దేశ్ బచావో' వాల్‌పోస్టర్ సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పదేండ్ల మోదీ పాలనలో దేశంలో ఎలాంటి మార్పులు రాలేదని, కేవలం మతోన్మాదం, కార్పొరేట్ శక్తుల అంశాలపైనే దృష్టి సారించారని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్ల కంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ కునుకుంట్ల శంకర్, బిజ్జ శ్రీనివాసులు, టీ సత్యప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ ఫిరాయింపులకు సీపీఐ వ్యతిరేకం

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): పార్టీ ఫిరాయింపుల విధానానికి సీపీఐ పూర్తి వ్యతిరేకమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు చెప్పారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల సభ్యత్వం వెంటనే రద్దయ్యేలా చట్టాలను కఠినతరం చేయాలని చెప్పారు. హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో సోమవారం కూనంనేని మీడియాతో మాట్లాడుతూ..లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి రాష్ట్రంలో పోటీ చేయడం, మద్దతివ్వడం వంటి అంశాలపై నిర్ణయం తీసుకొనే అధికారాన్ని పార్టీ జాతీయ నాయకత్వానికి అప్పగించామని చెప్పారు. కాళేశ్వరం, కృష్ణాబేసిన్ పరిధిలో పంటలు దెబ్బతినేందుకు కారణమెవరో ప్రజలకు తెలుసునని అన్నారు. 2014 నుంచి 2018 వరకు రాష్ట్రంలో పూర్తిస్థాయి కరువు ఉన్నదని, ఈ కాలంలో రూ.6 వేల కోట్ల వరకు పంట నష్టం జరిగిందని, 2017లో వరదలు, అధిక వర్షాలతో 12 లక్షల వానకాలం పంట, 5 లక్షల ఎకరాల యాసంగి పంట నష్టం జరిగిందని వివరించారు. 2023లో 12 లక్షల వానకాలం, 5 లక్షల యాసంగి పంటకు నష్టం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం అన్ని పంటలకు 10 లక్షల ఎకరాల్లో నష్టం జరిగిందని చెప్పారు. నష్టపోయిన ప్రతి ఎకరాకూ రూ.10వేల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నార్సింగిలో రెచ్చిపోయిన పోకిరీలు

మణికొండ, ఏప్రిల్ 1: నార్సింగిలో పోకిరీలు రెచ్చిపోయారు. కత్తులతో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఆదివారం సరుకుల కోసం దుకాణం వద్దకు వచ్చిన బాలికను వేధించారు. ఇదేం పద్ధతని నిలదీసిన బాలిక తండ్రి గొంతుకోసి చంపేందుకు యత్నించారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ నెమలినగర్ ప్రాంతానికి చెందిన నయికి రాముడు తన భార్య, పిల్లలతో కలిసి నివసిస్తున్నాడు. ఆదివారం రాముడు కూతురును సరుకుల కోసం కిరాణా దుకాణానికి పంపాడు. దుకాణం వద్ద ఉన్న సురేశ్ అనే యువకుడు బాలికను వేధించాడు. పక్కనే మోరీలోని వ్యర్థాలను ఆమెపై వేసి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. తండ్రి రాముడు సురేశ్‌తో వాదనకు దిగారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న సురేశ్‌తోపాటు అతడి స్నేహితులు రాముడిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ ఘటనలో రాముడు భార్యకు గాయాలయ్యాయి. ఈ విషయమై బాధితులు నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న సురేశ్, అతడి అన్న ప్రవీణ్ దుకాణం వద్ద రాముడి గొంతును కోసి పరారయ్యారు. ప్రస్తుతం రాముడి పరిస్థితి విషమంగా ఉన్నది. నార్సింగి పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

పంట వేస్తేనే రైతు బంధు

- ప్రజాభిప్రాయం ఇదే.. అసెంబ్లీలోనూ చర్చిస్తాం..
- నెలాఖరులోగా యాసంగి పెట్టుబడి సాయం
- రుణమాఫీపై కసరత్తు ప్రారంభించాం : మంత్రి తుమ్మల

ఖమ్మం, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఇక నుంచి పంట వేసిన వారికే పెట్టుబడి సాయం అందిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టంచేశారు. ప్రజల నుంచి ఇలాంటి విజ్ఞప్తులే వస్తున్నాయని, శాసన సభలో చర్చించి విధివిధానాలు రూపొందిస్తామని చెప్పారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం సన్నాయిగూడెంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 64.77 లక్షల మంది రైతులకు రూ.5,574.77 కోట్ల రైతుబంధు సాయాన్ని జమ చేశామని వివరించారు. రాష్ట్రంలో 92 శాతం మంది రైతులు 5 ఎకరాల్లోపు వారే ఉన్నారని, వారికి ఇప్పటికే రైతుబంధు అందిందని అన్నారు. మరో 4 లక్షల మందికి ఈ నెలాఖరులోగా అందిస్తామని అన్నారు. రైతుల రుణమాఫీపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించిందని, విధివిధానాలపై బ్యాంకర్లతో సమాలోచనలు జరుపుతున్నామని అన్నారు. ఈ ఏడాది చివరి నాటికి సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌కు తరలించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పేర్కొన్నారు. తాగునీటి అవసరాల కోసం పాలేరు రిజర్వాయర్‌కు రెండు రోజుల్లో సాగర్‌జలాలు వస్తాయని, ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో చర్చించామని అన్నారు.

కాంగ్రెస్ మూడు టికెట్లూ మాలలకే

- మాదిగ సామాజికవర్గానికి రిక్తహస్తం
- వరంగల్ అభ్యర్థిగా కడియం కావ్య
- కరీంనగర్, హైదరాబాద్ అభ్యర్థులు ఖరారు
- అయినా ఇంకా పేర్లు ప్రకటించని అధిష్ఠానం
- ఖమ్మం అభ్యర్థి ఎంపికపై 9 వరకు సస్పెన్స్

హైదరాబాద్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ): వరంగల్ ఎంపీ అభ్యర్థిగా కడియం కావ్య పేరును కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. దీంతో రాష్ట్రంలో ఎస్సీలకు రిజర్వ్ చేసిన మూడు ఎంపీ టికెట్లను కాంగ్రెస్ పార్టీ మాల సామాజికవర్గానికే కట్టబెట్టినట్టయ్యింది. ఈసారి కాంగ్రెస్ తరపున పోటీ చేసే అవకాశం మాదిగ సామాజికవర్గానికి దక్కకుండా పోయింది. సోమవారం ఉదయం ఢిల్లీలో సమావేశమైన కాంగ్రెస్ ఎన్నికల కమిటీ పెండింగ్‌లో ఉన్న వరంగల్, కరీంనగర్, హైదరాబాద్ నియోజకవర్గాల అభ్యర్థులను ఖరారు చేసినట్టు సమాచారం. ఖమ్మం అభ్యర్థిని మాత్రం ఈ నెల 9న జరిగే సీఈసీలో ఖరారు చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. అయితే, ఖరారు చేసిన ముగ్గురు అభ్యర్థుల్లో వరంగల్ అభ్యర్థిని మాత్రమే ప్రకటించి, కరీంనగర్, హైదరాబాద్ అభ్యర్థులను ప్రకటించలేదు. వీటిని పెండింగ్‌లో పెట్టడంలో ఆంతర్యం ఏమిటో తెలియరాలేదు. కరీంనగర్ అభ్యర్థిగా వెలిచాల రాజేందర్‌రావు పేరు ఖరారు అయినట్టు పార్టీ వర్గాలు చెప్తున్నాయి. హైదరాబాద్ అభ్యర్థి ఎవరన్నది బయటకు పొక్కడం లేదు. కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్రంలోని నాగర్‌కర్నూల్ (మల్లు రవి), పెద్దపల్లి (గడ్డం వంశీ), వరంగల్ (కడియం కావ్య) మూడు ఎస్సీ